క్లుప్తంగా

ఘనంగా దుర్గాభవాని మాత ఉత్సవాలు



అమ్మవారి సన్నిధిలో ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: కోహీర్ మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం దుర్గాభవానీమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒకేసారి హాజరై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, బీజేపీకి చెందిన మాజీ ఎంపీ బీబీ పాటిల్‌లు పార్టీ శ్రేణులతో కలిసి ఆలయ ప్రాంగణంలో దర్శించుకుని కలిసి ఫొటో దిగారు. ఇరుపార్టీల నేతలు ఆలయ ప్రాంగణంలో ఒకే ఫ్రేమ్‌లో రావడంపై గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు డీసీ సీబీ మాజీ చైర్మన్ జెపాల్‌రెడ్డి దర్శించుకున్నారు.

బోరంచలో భక్తుల సందడి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలివస్తున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ అన్ని సదుపాయాలు కల్పించాలని కమిటీ బాధ్యులను ఎమ్మెల్యే ఆదేశించారు.

నాణ్యత తప్పనిసరి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: రోడ్డు పనులు త్వరితగతిన నాణ్యతగా చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ్మారెడ్డిలు కోరారు. నారాయణఖేడ్-మాసాన్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. మళ్లీ రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఆదివారం పనులను పరిశీలించి వారు మాట్లాడారు. నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం ఇచ్చినట్లు గుర్తు చేశారు.

కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్లు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కొనసాగుతోంది. రాయికోడ్, వట్‌పల్లి, న్యాల్‌కల్, మనూర్, ఝరాసంగం తదితర మండలాల నుంచి రైతులు జొన్నలను కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. క్వింటాలు జొన్నలకు రూ.3,371ల ధర చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 3,100 క్వింటాళ్ల జొన్నలను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, కార్యదర్శి మహబూబ్ జానీలు తెలిపారు.

విద్యార్థికి సన్మానం



శ్రావణిని సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పది ఫలితాల్లో 600కు 593 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్, జిల్లా మొదటి ర్యాంకు సాధించిన అల్లూరు గ్రామానికి చెందిన శ్రావణిని ఆదివారం జిల్లా వీరశైవ లింగయత్, లింగబలిజ సంగం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. శ్రావణి పైచదువులు చదివి సమాజానికి, కుటుంబానికి గౌరవప్రదంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరశైవ బలిజ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌పాటిల్, కోశాధికారి గోపురాజు, సంగమేశ్వర్ సభ్యులు శివకుమార్, మల్లికార్జునశెట్టి, చంద్రశేఖర్, గౌరీశ్వర్, విజయ్‌కుమార్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

మండలంలోని అల్లాపూర్ గ్రామంలో ఆదివారం బీరప్పస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బీరప్పస్వామి నామస్మరణతో గ్రామం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.

–రాయికోడ్(అందోల్)

జొన్నల కొనుగోలు ఎప్పుడో?

వట్‌పల్లిలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రం

- యాసంగిలో 2800 ఎకరాలకు పైగా సాగు
- రైతుల ఇళ్లలోనే ధాన్యం నిల్వ
- ఆందోళనలో జొన్న రైతులు

ఈ యేడు యాసంగిలో జొన్న పంటను పండించిన రైతులు అమ్ముకొనేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోళ్లపై ప్రభుత్వానికి పట్టింపులేకపోవడంతో అన్నదాతలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. చేతికొచ్చిన పంటను ఇళ్లలో నిల్వ చేసుకొని కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

వట్‌పల్లి(అందోల్): ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతన్నలకు ధాన్యం విక్రయించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే మద్దతు ధరకు విక్రయించవచ్చని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. యాసంగి సీజన్‌లో ప్రతికూల వాతావరణం ఎదురైనప్పటికీ నానా తంటాలు పడి పంట పండించిన రైతుకు నేటి వరకు ధాన్యం విక్రయించుకునే అవకాశం లేక ఇళ్లలోనే నిల్వ ఉంచుకొని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తుందాని ఆశగా ఎదురుచూస్తున్నారు.

నెలరోజులుగా ఇళ్లలోనే నిల్వ

మండలంలో జొన్న సాగుచేసిన రైతులు ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ప్రాథమిక సహకార సంఘం, వ్యవసాయ శాఖల అధికారుల నుంచి ప్రకటనలు రావడంతో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు జొన్నలను బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తరలించారు. కానీ నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. పంట సాగుచేసేందుకు అప్పులు తీసుకువచ్చిన రైతులు అమ్మకాలు ఆలస్యం కావడంతో అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు కూడా జొన్నలను కొనేందుకు గ్రామాల్లోకి వస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.3 వేలకు పైగా ధర వచ్చే అవకాశం ఉండడం, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దేవునూర్‌లో ఏర్పాటు చేయలేం...

గతేడాది ఖాదిరాబాద్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ సహకారంతో మండలంలోని దేవునూర్ రైతువేదిక భవనంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందోల్, వట్‌పల్లి, పుల్‌కల్ మండలాలకు చెందిన 500 మంది రైతుల నుంచి 12 వేల క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది కూడా దేవునూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఖాదిరాబాద్ పీఏసీఎస్ సీఈఓకు మార్క్‌ఫెడ్ అధికారులు సూచించినప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. ఈ విషయమై తాము ఇప్పటికే వరి కొనుగోళ్లలో బిజీగా ఉన్నాం. తమకు సిబ్బంది కొరత ఉందని దూరంగా ఉన్న దేవునూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేమని ఖాదిరాబాద్ గ్రామంలో ఏర్పాటు చేస్తామని పీఏసీఎస్ సీఈఓ శ్రీకాంత్ సాక్షికి వివరించారు.



ఓ ఇంట్లో నిల్వ ఉంచి జొన్నలు

నెల రోజుల క్రితమే ప్రారంభించాలని చెప్పాం

దేవునూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోళ్లు జరపాలని ఖాదిరాబాద్ పీఏసీఏ సీఈఓకు తెలియజేశాం. కానీ ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. డీసీఎంఎస్ వారిని కూడా అడిగాం.. వారు కూడా సిబ్బంది కొరత ఉందని చెప్పారు. దీంతో డీసీఓ దృష్టికి తీసుకెళ్లాం. పీఏసీఎస్ ద్వారా ఒకటి రెండు రోజుల్లో కేంద్రాన్ని ప్రాంభించి జొన్నల కొనుగోళ్లు జరిపి రైతుల నుంచి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం. రైతులెవరూ ఆందోళన చెందొద్దు.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్ డీఎం, సంగారెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దళిత యువకుడిపై దాడిచేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద కేవీపీఎస్, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణిలో దళిత యువకుడిని సభ్య సమాజం తలదించుకునేలా కర్రలతో కొడుతూ నగ్నంగా ఊరేగిస్తూ తాళ్లతో కాళ్లు చేతులు కట్టేసి గుడి గోడకు నిలబెట్టి విపరీతంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన దుండగులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యానేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత్ మాతాకీ జై అంటావా లేదా అని దళితుల మీద దాడి చేయడం అమానుషమని, మతిస్థిమితం లేని దళిత యువకుడిపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. గుడిని కాలుతో తన్నాడని ఆరోపిస్తున్నా మతోన్మాదులు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి.. కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు? తక్షణమే దళితులపైన దాడి చేసి నగ్నంగా ఊరేగించిన మతోన్మాద దుండగులందరిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, శివకుమార్,మల్లేశం, రాజు, నాగభూషణం, పోతురాజు పవన్, అనిల్, శ్రీకాంత్, ఆనంద్, పురుషోత్తం, సంజీవ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ వాహనాల డ్రైవర్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా మల్లేశం గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థుల ఈత సరదా



కంది(సంగారెడ్డి): ఎండలు దంచి కొడుతున్నాయి. ఉ.10 గంటల నుంచి సా.5 వరకు ఎండతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. స్కూల్‌లకు సెలవులు రావడంతో విద్యార్థులు సరదాగా ఈత కొడుతూ సేద తీరుతున్నారు. మండల కేంద్రం కందిలో సుమారు 250 ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దబావిలో నీళ్లు అధికంగా ఉండడంతో విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున ఈ బావి వద్దకు చేరి ఈత కొడుతున్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జాతర్లతో ఆధ్యాత్మిక వాతావరణం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: జాతర నిర్వహణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, రేణుకఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు మల్లేష్, కృష్ణ, రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే కాలనీల అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అందరి భాగస్వామ్యంతో జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో రూ.55లక్ష వ్యయంతో నూతనంగా నిర్మించిన పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రాపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్‌ల్లో కాలనీల్లో మౌలిక సదుపాదులను కల్పించడంతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మల్లికార్జుననగర్ కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. కాలనీలో అనేక ఏళ్లుగా ఉన్న పార్కు స్థలం వివాదాన్ని పరిష్కారించి జీహెచ్‌ఎంసీ నిధులతో పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం హాల్ ఏర్పాటుకు త్వరలో నిధులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేష్, కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, నాయకులు ఐలేష్, పరమేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రొటోకాల్ రగడ..

పార్కు ప్రారంభోత్సనికి ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డిను ఎందుకు పిలువ లేదని బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. అధికారులు తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని వారు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న వేసవి శిబిరం



వేషధారణలో జూనియర్ ఆర్టిస్టులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని డిజైర్ సొసైటీలో రెండవరోజు వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సినీ జూనియర్ ఆర్టిస్టులు బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ డైలాగులు, స్టెప్పులతో విద్యార్థులను అలరించారు. అనంతరం నైల్‌లోరీ, టాటూస్ వంటి అంశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒరాకిల్ పరిశ్రమకు సంబంధించిన ప్రతినిధులు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ రవిబాబు, వైస్ ప్రెసిడెంట్ సుభాష్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు ఉన్నారు.

'లా' పోటీల్లో నూరీన్ ఫాతిమా ప్రతిభ

జహీరాబాద్ టౌన్: వర్ధమాన న్యాయ నిపుణుల్లో వివాద పరిష్కార పద్ధతులను ప్రోత్సహించడానికి 'హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్' అనే అంశంపై నిర్వహించిన లా పోటీల్లో విద్యార్థిని నూరీన్ ఫాతిమా రన్నరప్‌గా నిలిచారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్డు నం.3లోని సుల్తానా-ఉల్-ఉలూమ్ లా కళాశాలలో రెండు రోజుల పాటు పోటీలు జరిగాయి. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్‌కు చెందిన ఎండీ కరీం కూతురు నూరీన్ ఫాతిమా ఇంటర్ వరకు జహీరాబాద్‌లోనే చదువుకుంది. హైదరాబాద్‌లోని ఎగ్ ఫై యూనివర్శిటీ నుంచి లా పట్టా పొందారు. హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్ అనే అంశంపై జరిగిన పోటీల్లో మీడియేటింగ్ జంటగా లానా శర్మతో కలిసి పాల్గొని రన్నరప్‌గా నిలిచి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. భవిష్యత్‌లో ఉత్తమ న్యాయవాదిగా ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు.



నూరీన్ ఫాతిమా

ఉచితంగా కలరిపయట్టు శిక్షణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కలరిపయట్టు శిక్షణ 15 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 24న ప్రారంభమైన శిక్షణ మే 9వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. కేరళ ప్రాచీన క్రీడా ఆయన కలరిపయట్టు తో విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో మొదటిసారిగా కలరిపయట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 131 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారని అన్నారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు రుక్మారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మకరతోరణం బహూకరణ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం జంగంపేటలోని రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఆలయంలోని గర్భగుడికి చౌదరిగూడెం గ్రామానికి చెందిన మద్దూరి మాధవిమల్లారెడ్డి దంపతులు మకరతోరణాన్ని బహూకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జంగంపేట ఎల్లమ్మ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని కొనియాడారు. ఆలయకమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ప్రజాస్వామ్య రక్షణే లక్ష్యం

సదాశివపేట(సంగారెడ్డి): రాజ్యాంగంపై అవగాహన పెంచడమే జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బసవ చౌక్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా పాదయాత్ర చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సోదరులకు మహిళలకు రాజకీయ ఆర్థిక సామాజిక విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని జమ్గి(కే), రాసోల్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. జమ్గి(కే) గ్రామానికి చెందిన మహ్మద్ సోఫికి రూ. 60,000లు విలువ గల చెక్కు పంపిణీ చేశారు. రాసోల్ గ్రామానికి చెందిన కురుమ పండరికి రూ. 21,000లు విలువ గల చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబాజీరావు, మాజీ సర్పంచ్ సాయులు, ఉత్తంరావు, సంజుపటేల్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రార్థన మందిరం గోడల కూల్చివేత

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ గ్రామ శివారులో ప్రార్థన మందిరాన్ని గుర్తు తెలియని దుండగులు కూల్చేశారు. ఆదివారం పలువురు ప్రార్థన మందిరాన్ని పరిశీలించారు. ఈ నెల 3న రాత్రి జేసీబీ సహాయంతో కూల్చినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల లక్ష రూపాయలతో ఎర్రరాయితో నిర్మించినట్లు తెలిపారు. దుండగులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

◆ ఇసుక లారీల పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ అన్నారు. మండలంలోని హుస్సెళ్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రాష్ట్రం నుంచి అక్రమంగా కర్నాటకకు తరలిస్తున్న 8 లారీలను పట్టుకున్నారు. వాటిని హద్నూర్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

◆ నేటి నుంచి రిజిస్ట్రేషన్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని రైతులకు గుర్తింపు కార్డులను అందించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల, కానుకుంట రైతువేదికల్లో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ (లింకున్న నంబర్‌తో)తో సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ సమయపాలన పాటించని వైద్యులు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు విధులకు సక్రమంగా రావడంలేదని పట్టణానికి చెందిన శ్రీనివాస్ ఆరోపించారు. ఓపీ డాక్టర్లు సమయపాలన పాటించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇదే విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశానని చెప్పడంతో అధికారులు, కాంట్రాక్టు ఉద్యోగులు తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

◆ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామపరిధిలోని మరనాత హీలింగ్ టెంపుల్ చర్చి సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, చర్చి నిర్వాహకులు భాస్కరరావు, శంకర్ పాల్గొన్నారు.

◆ ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్‌లో రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం రేణుక ఎల్లమ్మ కల్యాణాన్ని ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. కల్యాణంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమార్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ దళిత రైతుపై దాడి.. కేసు నమోదు

కంది(సంగారెడ్డి): రహదారి ఏర్పాటు విషయంలో దళిత రైతు మల్లేపల్లి కృష్ణపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళితులు ఆందోళనకు దిగారు. ఆదివారం మధ్యాహ్నం కంది చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాచేశారు. అనంతరం రైతుపై దాడికి పాల్పడిన సునీల్ దేశ్ముఖ్ ఇంటి వద్దకు చేరి నిరసన తెలిపారు. ఆందోళన చేస్తున్న వారికి సునీల్ దేశ్‌ముఖ్ క్షమాపణ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో బూడిద కుమార్, దశరథ్, శ్రీనివాస్, రాందాస్ చంద్రశేఖర్ గుప్తా, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై రవీందర్‌ను వివరణ కోరగా మల్లెపల్లి కృష్ణ ఫిర్యాదు మేరకు సునీల్ దేశ్‌ముఖ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ భగీరథుడు ఆదర్శప్రాయుడు

నారాయణఖేడ్: భావితరాలకు భగీరథుడు ఆదర్శప్రాయుడని సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య సగర అన్నారు. ఆదివారం సగరుల (ఉప్పరుల) ఆరాధ్యదైవమైన భగీరథ మహర్షి జయంతిని ఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంగను దివినుంచి భువికి తీసుకువచ్చిన భగీరథుడిని స్మరించి పూజించడం ఎంతో అవసరమన్నారు. సగరులు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు పండరి, బాలరాజ్, మాణిక్ ప్రభు, విఠల్, గోపాల్, సాయిలు, నర్సింహులు, విష్ణు పాల్గొన్నారు.